## క్లుప్తంగా

### ఆక్వా రైతులను ఆదుకుంటాం



కైకలూరు: అమెరికా అధిక సుంకాల విధింపుతో సంక్షోభంలోకి వెళ్లిన ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటాయని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రొయ్యల ధరలు పతనం, ఇతర సమస్యలను ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ప్రతినిధులతో చర్చిస్తోందని తెలిపారు. అదేవిధంగా సుప్రీం కోర్టులో కొల్లేరు కేసుపై ఈ నెల 16న ప్రభుత్వం తరపున సమాధానం చెబుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కూటమి నేతలు వీరమల్లు నరసింహారావు, పెన్మత్స త్రినాథరాజు, తేరా రమేష్, బొర్రా చలమయ్య, బీకేఎం.నానీ, ఫులా రాజీ పాల్గొన్నారు.

### కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



తోట్లవల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి బీసీ, రెడ్డి, కమ్మ, కాపు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 48 యూనిట్లకుగానూ 433 మంది దరఖాస్తు చేయగా, 390 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్, బ్యాంకర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### దాతల సహకారం అభినందనీయం



పమిడిముక్కల: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, అలాంటి విద్యకు దాతల సహకారం అభినందనీయమని ఎస్ఐ శ్రీను పేర్కొన్నారు. పెనుమత్సలో విద్యార్థుల చదువు నిమిత్తం చెరుకూరి వెంకటేశ్వరరావు భార్య బేబీ సరోజిని గ్రామానికి చెందిన విద్యార్థులు తులసి ప్రియ, మణికంఠలకు మంగళవారం రూ.25 వేల సాయం అందజేశారు. గ్రామ పెద్దలు మొవ్వ రాము, చింతమనేని రాంబాబు, గాజుల సురేష్ పాల్గొన్నారు.

### ఉపాధి పనులతో కూలీలకు మేలు



గుడ్లవల్లేరు: జాతీయ ఉపాధి హామీ పనులతో కూలీలకు మేలు చేకూరుతుందని వడ్లమన్నాడు గ్రామ ప్రముఖుడు పెన్నేరు రమేష్ అన్నారు. గ్రామంలో ఉపాధి పనులను స్థానిక ఉపాధి కూలీలకు ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, తోట చిన్నారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### నాట్య విద్యార్థులకు ఉపకరణాల వితరణ



కూచిపూడి(మొవ్వ): నాట్య క్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠానికి ప్రవాస భారతీయురాలు నాట్యాచారిణి తురగా గీతా అపర్ణ నాట్య విద్యార్థుల సౌకర్యార్థం ఉపకరణాలను వితరణగా మంగళవారం అందజేశారు. వాటర్ ప్యూరిఫయర్‌తో పాటు రూ.50వేల విలువ గల మైక్ సెట్, మిక్సర్ తదితర పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ వేదాంతం వెంకట దుర్గా భవాని, పసుమర్తి హరినాథ్ శాస్త్రి, లైబ్రేరియన్ వైవీ ఫణికుమార్ కళా పీఠం విద్యార్థులు పాల్గొన్నారు.

### చిన్నారులకు ఫిజియోథెరపీ

మండవల్లి: మండలంలోని లోకుమూడి భవిత స్పెషల్ స్కూల్లో ప్రత్యేక అవసరాలు గల ఎనిమిది మంది చిన్నారులకు మంగళవారం ఫిజియోథెరపిస్ట్ సునీత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ క్యాంపులో మాదిరిగా ఇంటివద్ద పిల్లలతో ఆసనాలు చేయించాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం పి.నరసింహారావు పర్యవేక్షించారు. ఐఈఆర్టీలు టి.అరుణకుమారి, పి.వసంత, శైలజ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్య తీవ్రతరం

- ఇసుక లారీలు, ట్రాక్టర్లతో సమస్య
- వాహనాల రద్దీతో ప్రజలకు అవస్థలు
- పట్టించుకోని పోలీసులు



తోట్లవల్లూరులో వాహనాల రద్దీ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రతరమవుతోంది. పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. సిబ్బంది కొరత పేరు చెప్పి పోలీసులు ట్రాఫిక్ నిర్వహణను గాలికొదిలేయటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తోట్లవల్లూరులో వాహనాల రాకపోకలు ఎక్కువవుతుండటంతో ట్రాఫిక్ తీవ్రత నిత్యకృత్యంగా మారుతోంది. మెయిన్ సెంటర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు అడ్డదిడ్డంగా నిలిపి వేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది.

### ఎదురుగా వస్తే అంతే...

మెయిన్ సెంటర్ నుంచి కేఈబీ కాలువ వంతెన మధ్యలో ఆర్అండ్‌బీ రహదారి వెడల్పు బాగా తక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. ఎదురుగా వాహనం వస్తే ద్విచక్ర వాహనదారులు సైతం తప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. కనీసం సాయంత్రం వేళల్లోనైనా మెయిన్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పెరిగిన వాహనాల రద్దీ

వాహనాల రద్దీ ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఇసుక రవాణ జోరుగా సాగుతుండటంతో లారీలు, ట్రాక్టర్ల రాకపోకలు అధికమయ్యాయి. కరకట్ట వెంబడి రొయ్యూరు, తోట్లవల్లూరు, కంకిపాడు మండలం మద్దూరు ఇసుక క్వారీల నుంచి వందలాదిగా లారీలు, ట్రాక్టర్లు తోట్లవల్లూరు మీదుగా ఉయ్యూరు, పామర్రు, మచిలీపట్నం వైపు వెళుతున్నాయి. దీంతో రోడ్డుపై చిన్నపాటి వాహనం అడ్డొచ్చినా ఎక్కడి లారీలు అక్కడే నిలిచిపోతున్నాయి.



మెయిన్ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

### ఇబ్బందిగా ఉంటోంది



తోట్లవల్లూరులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా సాయంత్రం వేళ ట్రాఫిక్ మరింత ఎక్కువగా ఉంటోంది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– అద్దేపల్లి శ్రీరాములు, తోట్లవల్లూరు

### ట్రాఫిక్‌ను నియంత్రించాలి



ఇసుక లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు ఇటీవల కాలంలో బాగా ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో తోట్లవల్లూరులో ట్రాఫిక్ సమస్య అధికమైంది. ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– పీఎస్ కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ, తోట్లవల్లూరు

### చర్యలు తీసుకుంటాం



తోట్లవల్లూరులో ఇసుకలారీలు, ట్రాక్టర్ల కారణంగా ట్రాఫిక్ సమస్య పెరిగిన మాట వాస్తవమే. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడతాం.

– సీహెచ్ అవినాశ్, ఎస్ఐ, తోట్లవల్లూరు

## కనకవల్లి సర్పంచ్‌కు కైలే పరామర్శ

తోట్లవల్లూరు: కనకవల్లి సర్పంచ్ పెనమకూరు నరసింహశర్మను పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. నరసింహశర్మ తల్లి పెనమకూరు హేమలత(76) ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటానికి అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. వల్లూరుపాలెంలో ఇటీవల మొక్కజొన్న యంత్రంలో చిక్కుకుని మృతి చెందిన తుమ్మల జ్యోతి(33) కుటుంబ సభ్యులను అనిల్‌కుమార్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు రాజేంద్ర, సర్పంచ్‌లు రమేష్, ఉదయభాస్కర్, ఎంపీటీసీ మధుబాబు, నాయకులు రూబెన్, గవాస్కర్‌రాజు, శివశంకర్, రామ్‌ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.



హేమలత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

## నలుగురు వీఆర్వోలకు ఉద్యోగోన్నతి

గుడివాడరూరల్: గుడివాడ తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు వీఆర్వోలకు ఉద్యోగోన్నతి లభించింది. మండలంలోని శేరీగొల్వేపల్లి వీఆర్వో కాటూరి అనిల్‌కుమార్, బొమ్ములూరు వీఆర్వో షేక్ మరియంబి, వలివర్తిపాడు వీఆర్వో పి.శ్యాంబాబుకు సివిల్ సప్లయ్స్ కార్యాలయం మచిలీపట్నంలో సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందారు. అదేవిధంగా మోటూరు వీఆర్వో బి.సాల్మన్‌రాజు పెడన తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. వీరిని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ కట్టా రామశివ, పీడీఎస్ డీటీ కిరణ్, ఆర్ఐ నాగబాబు అభినందించారు.

## రామాలయంపై కూలిన కొబ్బరిచెట్టు



తోడేళ్లదిబ్బలంకలో రామాలయంపై కూలిన కొబ్బరిచెట్టు



తోడేళ్లదిబ్బలంకలో పడిపోయిన విద్యుత్ స్తంభం

తోట్లవల్లూరు: ఈదురుగాలుల ప్రభావంతో రామాలయంపై కొబ్బరిచెట్టు కూలిన ఘటన మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో జరిగింది. గ్రామంలో సోమవారం కొద్ది సేపు బలమైన ఈదురుగాలులు వీచాయి. గాలుల తీవ్రత కారణంగా స్థానిక రామాలయంపై సమీపంలో ఉన్న కొబ్బరిచెట్టు కూలి శ్లాబు భాగం దెబ్బతింది. అలాగే పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా గాలుల ధాటికి కూలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## 11 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పమిడిముక్కల: మేడూరు శివారు ధూళిపూడిపాలెంలో ఈ నెల 11,12,13 తేదీల్లో ధూళిపూడిపాలెం యువత ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీ సమయంలో భద్రత, క్రీడా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. కమిటీ నిర్ణయమే తుది నిర్ణయం అవుతుందని తెలిపారు. ప్రతి జట్టులోని క్రీడాకారులు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఒకే గ్రామ పంచాయతీకి చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. ఆటగాళ్లు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95425 62774(రేవంత్), 84999 01777(చైతన్య)లో సంప్రదించాలని కోరారు.


## ఆంజనేయులుపై ఆరోపణలను ఖండిస్తున్నాం

పామర్రు: కృష్ణా మిల్క్‌యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులుపై చేసిన నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నామని ఆ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాల సేకరణ కేంద్రంలో మంగళవారం ఆంజనేయులు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాల కేంద్రాల అభ్యున్నతికి ఆంజనేయులు చేస్తున్న కృషిని చూసి తట్టుకోలేక కొందరు ఆయనపై అపవాదులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, బొమ్మారెడ్డి పూర్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయులు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

## వృద్ధుడిని గుర్తిస్తే తెలియజేయాలి



గాయాలతో ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు

పామర్రు: గాయాలపాలై రోడ్డు పక్కన పడి ఉన్న వృద్ధుడి అడ్రస్‌ను ఎవరైనా గుర్తిస్తే వెంటనే తమకు తెలియజేయాలని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ సోమవారం రాత్రి గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్న ఓ వృద్ధుడిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఇతడి అడ్రస్ తెలియలేదని పేర్కొన్నారు. ఎవరికైనా వృద్ధుడి అడ్రస్ తెలిస్తే స్టేషన్ ఫోన్ నంబరు 94407 96481కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రేపు సర్వసభ్య సమావేశం

కైకలూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండలరావు మంగళవారం తెలిపారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

## అప్సడా వైస్ చైర్మన్ దృష్టికి ఆక్వా రైతుల సమస్యలు

కైకలూరు: రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి దృష్టికి ఆక్వా రైతులు సమస్యలను విజయవాడ కార్యాలయంలో కలిదిండి మండలానికి చెందిన అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు మంగళవారం తీసుకెళ్లారు. అనంతరం కలిదిండిలో అద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికాకు ఎగుమతవుతున్న రొయ్యలపై ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఎగుమతి సుంకం వల్ల రొయ్య రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణం ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, పెద సింగు చందర్రాజు, కొల్లాటి గోకర్ణేశ్వరరావు పాల్గొన్నారు.

### వైద్యానికి ప్రాధాన్యం

కైకలూరు: ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లా క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తామరకొల్లు, శృంగవరప్పాడు, చింతపాడు, కొచ్చెర్ల, పెదపుట్లపూడి, చినతాదినాడ, మట్టగుంట, గురజ, సింగరాయపాలెం గ్రామాలకు చెందిన 14 మందికి రూ.5,11,887 విలువ కలగిన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు.

## ఘనంగా ద్వాదశ ప్రదక్షిణ



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి స్వామికి ద్వాదశ ప్రదక్షిణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు రావూరి పరుసురామయ్య దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనపరెడ్డి చంద్ర శేఖర్‌రావు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల రామదాసు, ఎస్ శ్రీనివాసరావు, యునాని, భక్తులు రావూరి నాగమల్లేశ్వరరావు, జితేంద్రసాయి పాల్గొన్నారు.

### సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదానానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

## చెత్త సేకరణపై సంపూర్ణ అవగాహన కల్పించండి

అధికారులపై కలెక్టర్ డీకే బాలాజీ ఆగ్రహం



క్షేత్ర స్థాయిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

గూడపాడు(మొవ్వ): మొవ్వ మండలం గూడపాడు గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ విషయంలో గ్రామస్తులకు సంపూర్ణ అవగాహన కల్పించడంలో అధికారుల తీరు తెన్నులపై కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మొవ్వ మండలంలోని గూడపాడు, పెద్దపూడి గ్రామాల్లో పర్యటించారు. గూడపాడు గ్రామంలో తడి, పొడి చెత్తను కలిపి ఇవ్వటం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన అధికారుల వైఫల్యంపై ఆగ్రహించారు. గ్రామంలో రోజూ 50 గృహాలకు అధికారులు వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ విషయంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆయన పెద్దపూడి గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఆర్‌సీసీ పైపులతో నూతనంగా నిర్మించిన భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. పని పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పనిని ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసి నిర్వహిస్తున్న ఆ గ్రామ సర్పంచ్ తాతా రజిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి శివరామ కృష్ణ ప్రసాద్‌ను కలెక్టర్ అభినందించి బహుమతి అందించారు. అలాగే గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాతా ఉగాది లక్ష్మి, ఎంపీడీఓ విమాదేవి, ఈఓపీఆర్డీ ఎంఎస్‌కే పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, మొవ్వ–1 సచివాలయ వీఆర్వో నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఆత్మీయ సమావేశానికి తరలివెళ్లిన నాయకులు



ఆటపాక ఐస్ ఫ్యాక్టరీ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో డీఎన్నార్

కైకలూరు: జిల్లా ఆత్మీయ సమావేశానికి కైకలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. ఆటపాక ఐస్ ఫ్యాక్టరీ వద్దకు నాలుగు మండలాల నుంచి నాయకులు చేరుకున్నారు. వాహనాల్లో అక్కడి నుంచి ఏలూరు మినీ బైపాస్ రోడ్‌లో క్రాంతి మండపంలో జరుగు ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ సెక్రటరీలు కూసనపూడి కనకదుర్గారాణి, గంటా సంధ్య, రాష్ట్ర రైతు విభాగ జాయింట్ సెక్రటరీ ఐనాల బ్రహ్మాజీ, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు, మండల పార్టీ అధ్యక్షులు ఏసేబురాజు, రమేష్, రాము, రామరాజు, నాయకులు నరసింహారావు, రామారావు, రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## కొడాలి నాని త్వరగా కోలుకోవాలని అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న మండలి, యాదవసేవా సంఘ నాయకులు

గుడివాడరూరల్: గుండె ఆపరేషన్ జరిగిన మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కోలుకుని సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆంజనేయస్వామి ఆలయ మాజీ కమిటీ సభ్యుడు కంతేటి హరిబాబు సౌజన్యంతో వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొంకితల ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ రీసెర్చ్ సెంటర్‌కు ప్రథమ స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ బానోత్

గుడివాడరూరల్: రూరల్ ప్రాంతంలో ఉన్న గుడివాడ హోమియో రీసెర్చ్ సెంటర్(ఆర్ఆర్ఐ) దేశంలోని 46 హోమియో సెంటర్లలో ప్రథమ స్థానంలో ఉందని స్థానిక ఆర్ఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ బానోత్ తెలిపారు. స్థానిక ఏలూరురోడ్డులోని హోమియో రీసెర్చ్ సెంటర్‌లో మంగళవారం వైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక మెట్రో నగరాల్లో ఉన్న హోమియో సెంటర్ల కంటే అత్యున్నత వృద్ధిరేటు సాధిస్తూ గుడివాడ రీసెర్చ్ సెంటర్ ప్రథమ స్థానంలో నిలిచి ఉండటం గర్వకారణమన్నారు. ఐదుగురు స్పెషలిస్ట్ వైద్యులు సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అత్యాధునిక వైద్య యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దక్షిణ ఒడిశా, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాల నుంచి గుడివాడ రీసెర్చ్ సెంటర్‌కు ఆయా ప్రాంతాల ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందుతారన్నారు. నిత్యం రీసెర్చ్ సెంటర్‌లో సుమారు 300 నుంచి 400మంది రోగుల వరకు వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఈ మూడు నెలలలోపు ఢిల్లీ కేంద్ర సెంటర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ జరుగుతుందని, ఉన్నతాధికారుల నిర్దేశించిన వారికే కొత్త టెండర్ వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై వదంతులు వ్యాప్తి చేయవద్దని, టెండర్ ప్రక్రియ మొత్తం ఢిల్లీ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆర్ఆర్ఐ సైంటిస్ట్ వైద్యులు శివకుమార్ గోలి, డాక్టర్ హీరాసైకుమార్, డాక్టర్ బృంద పాల్గొన్నారు.

## ఘనంగా డోలోత్సవం

పామర్రు: మండలంలోని జమీదగ్గుమిల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్వామికి మంగళవారం డోలోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి ఊంజల సేవను చేశారు. అనంతరం స్వామికి నీరాజన మంత్ర పుష్పాలను ఇచ్చి వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రావూరి నాగమల్లేశ్వరరావు, ఉమాదేవి, ఆర్.సాయి జాహ్నవి పాల్గొన్నారు.

## రామవరంలో హుండీ చోరీ

కైకలూరు: మండలంలోని రామవరం ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు ఈ నెల 6న రాత్రి కావూరి వేణుగోపాలరావు అనే వ్యక్తి గుడి వద్దకు రాగానే గేట్లు తీసి హుండీ పగలగొట్టి ఉండడం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. హుండీలో సుమారు రూ.10 వేలు దొంగతనం జరిగిందని భావిస్తున్నారు. వేణుగోపాలరావు ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు



స్వామిని పూజిస్తున్న భక్తులు

పామర్రు: ఉండ్రపూడి పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేషంగా అభిషేకాలను నిర్వహించారు. నాగవల్లీలతో వడ మాలతో అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల పొంగళ్లను వండి స్వామికి నివేదన సమర్పించారు. పూజలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈఓ ప్రసాదరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.